ఎంబీఏ (టీఎం), ఎంబీఏ (ఈవినింగ్) ప్రవేశాల నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్-ఈవినింగ్), ఎంబీఏ (పార్ట్‌టైం-ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఇంచార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ పి.జలపతి తెలిపారు. పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తమ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని, నియమిత ఫీజు రశీదుతో సహా తమ కార్యాలయంలో అక్టోబర్ 19లోగా సమర్పించాలని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో అక్టోబర్ 24వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పరీక్షను అక్టోబర్ 27వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. పై రెండు కోర్సులూ ఈవినింగ్ కోర్సులేనని చెప్పారు. టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఎంబీఏ కోర్సు కాల వ్యవధి రెండేళ్లు కాగా, పార్ట్‌టైం ఎంబీఏ కోర్సు కాలవ్యవధి మూడేళ్లని పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్-2024లో అర్హత సాధించినవారు ఈ పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, వారు దరఖాస్తు సమర్పించి, నేరుగా కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని వివరించారు. ఈ రెండు కోర్సులకూ డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లు ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉండడం తప్పనిసరి అని చెప్పారు. ఇతర వివరాలకు www.ouadmissions.com, www.osmania.ac.in వెబ్‌సైట్లలో చూసుకోవచ్చని సూచించారు.

బీఎస్-ఎంఎస్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎస్-ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్-ఫైవ్ ఇయర్ ఇంటిగ్రేటెడ్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రాం) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డీపీఈడీ, బీపీఈడీ పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డీపీఈడీ, బీపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. డీపీఈడీ, బీపీఈడీ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

టీజీ సెట్ ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 23: రాష్ట్రవ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్-2024 పరీక్ష ప్రశ్నాపత్రం ప్రాథమిక కీని ఇప్పటికే విడుదల చేశామని, దీనిపై అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ ఉపయోగించి, లాగిన్ అయి, అభ్యంతరాలు లేవనెత్తవచ్చని చెప్పారు. దానికి సంబంధించిన సాక్ష్యాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందన్నారు. దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సంఘటనా స్థలంలో బాధితులతో మాట్లాడుతున్న హయత్‌నగర్ సీఐ

సోమలింగేశ్వరనగర్ కాలనీలో దుండగులు కూల్చిన గదుల శిథిలాలను చూపుతున్న కాలనీవాసులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 23: అర్ధరాత్రి వేళ కాలనీలోకి చొరబడి ప్లాట్ల చుట్టూర వేసిన ప్రహరీ గోడలను, గదులను జేసీబీతో ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమలింగేశ్వరనగర్ ప్లాట్ల ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.చెంచల్ రావు, కార్యదర్శి ఎంవీ రావు, కోశాధికారి వై.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బొమ్మలగుడి సమీపంలోని సోమలింగేశ్వరనగర్ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బాగ్ హయత్‌నగర్ సర్వే నం. 180, 187లో పట్టాదారులు జెల్లా భిక్షమయ్య, జెల్లా అచ్చిలింగంలే అవుట్ చేసిన వెంచర్‌లో 1983వ సంవత్సరం నుంచి 1986 మధ్య కాలంలో 101 మంది ప్రభుత్వ ఉద్యోగులం ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నందున మా కార్యక్రమాల్లో బిజీగా ఉంటూ ప్లాట్ల వద్దకు రాలేక పోయామని ఇదే అదనుగా భావించి కొందరు వ్యక్తులు డాక్యుమెంట్లను సృష్టించి ప్లాట్ల స్థలాలను కబ్జా చేసేందుకు యత్నించారని తెలిపారు. ఈ విషయంలో కోర్టులకు వెళ్లగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. ప్లాట్లు ఖాళీగా ఉండటంతో స్థలాలు కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని గ్రహించిన తాము ఆగస్టులో ప్లాట్లకు హద్దులను ఏర్పాటు చేసుకునే ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఇది తెలుసుకున్న సురేందర్‌రెడ్డి అనే వ్యక్తి ఆగస్టు 24న తమ స్థలాల్లోకి అక్రమంగా ప్రవేశించి దాడులకు పాల్పడగా హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్లాట్ల రక్షణ కోసం ప్రహరీగోడలు, గదులను నిర్మించుకోగా ఆగస్టు 29న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ రోడ్డు వైపు ఉన్న ప్లాట్ల ప్రహరీగోడలు, గదులను కూల్చి వేశామన్నారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ప్లాట్ల రక్షణ కోసం నలుగురు సెక్యూరిటీ గార్డులను నియమించడంతో పాటు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. రక్షణ చర్యలు తీసుకున్నప్పటికీ ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో సుమారు 100 మంది రెండు జేసీబీలను తీసుకుని సోమలింగేశ్వరనగర్ కాలనీలోకి ప్రవేశించి సెక్యూరిటీ గార్డులపై దాడులు చేశారని తెలిపారు. సెక్యూరిటీ గార్డుల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లతో పాటు సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారని తెలిపారు. సుమారు 50 ప్లాట్ల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రహరీగోడలు, గదులను జేసీబీలతో ధ్వంసం చేసి వెళ్లారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులమైన మమ్మల్ని భూకబ్జాదారులు బెదిరింపులకు పాల్పడుతూ స్థలాలను కబ్జా చేయాలని యత్నిస్తున్నారని తెలిపారు. కబ్జాదారుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మరోసారి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, ఉమాకాంత్, ప్రసాద్, సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు

లాభాలకు ఏఐటీయూసీ వ్యతిరేకం కాదు

- కార్మికుల కొనుగోలు శక్తిని పెంచాలి : మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ రావు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 23: కార్మికుల కొనుగోలు శక్తిని పెంచకుండా ఆర్థిక పురోగతి సాధించలేమని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు అన్నారు. సోమవారం దత్తు నాయక్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో 'ఆర్థిక లాభాల కోసమా ప్రజల కోసమా' అనే అంశంపై ఏఐటీయూసీ సెమినార్ నిర్వహించారు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తి శక్తులకు ఆదాయాన్ని పెంచాలన్నారు. ఉత్పత్తి పెంచడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించలేమని ప్రజల దగ్గర కొనుగోలు శక్తి లేకపోతే పారిశ్రామిక ఉత్పత్తులను ఎవరు కొనాలని అన్నారు. ఏఐటీయూసీ ఎప్పుడు కార్మికుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. కష్ట జీవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. నిరంతరం ఆర్థిక పోరాటాలు, వర్గ పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పేదలకు కష్ట జీవులకు ఎందుకు రాయితీలు ఇవ్వడం లేదన్నారు. ప్రధానమంత్రి మోదీ తీసుకొచ్చిన కార్మిక చట్టాలు గొడ్డలి పెట్టులాంటివి అన్నారు. కార్పొరేటర్ సంస్థలకు మాత్రమే ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఎండీ యూసూప్, నాయకులు జంగయ్య, రవీంద్ర చారి, నర్సింహ, వాసిరెడ్డి, రత్నాకర్ రావు, రామస్వామి, ప్రేమ్ పావణి, సత్యనారాయణ, చంద్రయాదవ్ తదితరులు ఉన్నారు.

త్వరలోనే బ్రాహ్మణ పరిషత్ నిధుల విడుదల చేస్తాం



బ్రాహ్మణ పరిషత్ నిధులు విడుదల చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును కలిసి కోరుతున్న టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌శర్మ

ఆర్కేపురం, సెప్టెంబర్ 23: త్వరలో బ్రాహ్మణ పరిషత్ నిధులు విడుదల చేసి, బ్రాహ్మణుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తామని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ సోమవారం బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో కలిసి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి బ్రాహ్మణ పరిషత్ నిధుల విడుదలపై వినతి పత్రం అందజేశారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా విదేశీ విద్య చదువుకుంటున్న విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిధులు విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు. అదే విధంగా బ్రాహ్మణ పరిషత్‌ని పునరుద్ధరించాలని కోరినట్లు చెప్పారు. అందుకు మంత్రి స్పందించి ఆలస్యం కాకుండా త్వరలోనే నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బ్రాహ్మణులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్‌శర్మ, మోత్కూరు రామేశ్వర్‌రావు, నమిలికొండ కిరణ్, సంఘం సభ్యులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా..

కందుకూరు, సెప్టెంబర్ 23: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ డీఈఈ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశపు హాల్‌లో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల నీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో గ్రామాల్లో ఉన్న తుగునీటి పంపులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీవో సరిత, ఏఈలు శారధ, కీర్తన పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

బడంగ్‌పేట, సెప్టెంబర్ 23: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17నుంచి 2 తేదీ వరకు కమిషనర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సోమవారం బాలాపూర్ మండల తాసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ కమిషన్ డిప్యూటీ సీఈవో హరిసింగ్, బాలాపూర్ తాసీల్దార్ ఇంద్రాదేవి, మహేశ్వరం తాసీల్దార్ సైదులు, సరూర్‌నగర్ తాసీల్దార్ పి.వేణుగోపాల్, కమిషనర్లు రఘుకుమార్, వాణిరెడ్డి, చంద్రశేఖర్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు.

తల్లి పాలే శ్రేయస్కరం

పోషన్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో రేణుక

బడంగ్‌పేట, సెప్టెంబర్ 23: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని హయత్‌నగర్ ప్రాజెక్ట్ డైరెక్టర్(సీడీపీవో) రేణు తెలిపారు. సరూర్‌నగర్ మండల పరిధిలోని బైరామల్ గూడలో పోషన్ మాసం కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోషన అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి.. ఆరు నెలల పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల మీద, పౌష్టికాహారం పైన మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు బి.నారాయణమ్మ, జడ్జి శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ రమేశ్, శ్రీవాస్తవ, టీచర్ కరుణ, ఏఎన్ఎం అనురాధ, ఎన్‌జీవో ప్రజ్వల, వి.హర్షిత, సూపర్‌వైజర్ రఘు, శ్యామల, పోషన్ స్టాప్ శ్రీను, యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు బిరుదు యశోధ, అనంత, రేణుక, పద్మశ్రీ, శోభ, శ్రీలత, కలమ్మ, మస్రు, వరలక్ష్మి, శోభ, ఇందిర, మహేశ్వరి, తదితరులు ఉన్నారు.

తిరుమల బ్యాంక్ 27వ వార్షికోత్సవం సందర్భంగా అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తిరుమల బ్యాంక్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, హీరో సుమన్ తల్వార్, తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్, బ్యాంక్ డైరెక్టర్లు, మేనేజర్లు, ఖాతాదారులు తదితరులు – సైదాబాద్, సెప్టెంబర్ 23

ఏకలవ్య కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని మంత్రి సీతక్కకు వినతి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 23: ఏకలవ్య కార్పొరేషన్‌కు వెంటనే చైర్మన్‌ను నియమించాలని కోరుతూ మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు కురకుల కృష్ణ, కెంసారం ఎల్లయ్య, చెర్ల రమేశ్, ఉల్లంగొండ రాజు, మల్లికార్జున్, మున్న, జాని పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ చాంప్ ధృవ్‌సింగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన 68వ ఇంటర్ స్కూల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ధృవ్‌సింగ్ చాంపియన్‌గా నిలిచాడు. సోమవారం ఎల్బీ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన బాలుర అండర్-14 ఫైనల్లో 12 ఏండ్ల ధృవ్ విజేతగా నిలిచాడు. త్వరలో జరుగనున్న ఇంటర్ డిస్ట్రిక్ టోర్నీకి ఎంపికైన ధృవ్.. ప్రస్తుతం ఎల్బీ స్టేడియంలో ప్రతాప్‌కుమార్ దగ్గర శిక్షణ పొందుతున్నాడు.

ట్రావెల్ సంస్థపై కేసు నమోదు

కాచిగూడ,సెప్టెంబర్ 23: అమాయకులను నమ్మించి డబ్బులు దండుకున్న ఓ ట్రావెల్ ఏజెన్సీపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కడపకు చెందిన గంటసాల సుభాశ్ చంద్ర(44) కుద్బిగూడలో లోటాస్ హాలిడే టూర్స్, ట్రావెల్స్ ఏజెన్సీని నడుపుతున్నాడు. కొంత కాలంగా అమాయకులను మభ్యపెట్టి విదేశీ వీసాలు, విహార యాత్రలకు వెళ్లేందుకు టికెట్లను ఇప్పిస్తానని వారి నుంచి రూ.30 లక్షలు దండుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30న యువజనోత్సవాలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఈనెల 30న సికింద్రాబాద్ బోట్స్ క్లబ్‌లోని యువజన సర్వీసుల శాఖ ప్రాంగణంలో యువజనోత్సవాలు, జిల్లా స్థాయి సైన్స్ మేళా నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా యువజన క్రీడా అధికారి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో భాగంగా నేపథ్య పోటీలు, ఫోక్ డ్యాన్స్, ఫోక్ సాంగ్, కవిత్వం, కథా రచన, పెయింటింగ్, ప్రకటన, హస్తకళ, వస్త్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తుల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 15 నుంచి 29 ఏండ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను లక్డీకపూల్‌లోని స్నేహసిల్వర్ జూబిలీ భవన్‌లో ఉన్న యువజన కార్యాలయలంలో అందించాలని కోరారు. ఈనెల 27లోపున దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరింత సమాచారం కోసం 040-23205577 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు.

28న ఎంజే మార్కెట్‌లో గజల్ షాయారీ

సిటీబ్యూరో, సెప్టెంబరు 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ వారసత్వాన్ని కాపాడుట, కళలను ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఎంజే మార్కెట్ ప్రాంగణంలో గజల్, షాయారీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖ గజల్, షాహిరి కళాకారులచే నిర్వహించనున్నందున ఆసక్తిగల వారంతా బుక్ మై షో లింక్ ద్వారా బుక్ చేసుకొని సీటును రిజర్వ్ చేసుకోవాలని జీహెచ్ఎంసీ కోరింది. గ్రేటర్ హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడేందుకు జీహెచ్ఎంసీ విశేష కృషి చేస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ పేర్కొన్నారు. హైదరాబాద్ వారసత్వ సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో ప్రజా సంబరాల కార్యక్రమాల ద్వారా చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కమిషనర్ చెప్పారు. పరిమిత సీట్లు ఉన్నందున ఆసక్తి గల వారందరూ బుక్ మై షో ద్వారా బుకింగ్ చేసుకోవాలని కమిషనర్ కోరారు.

వర్షంతో నష్టపోయిన పంటను చూసి ఆవేదన చెందుతున్న బాబు

ఆగమైనం సారూ.. ఆదుకోండి

- రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది
- అందని రైతు బంధు.. అకాల వర్షాలతో పంట నష్టం
- ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతి

కందుకూరు, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని నమ్ముకుంటే.. మోసం చేస్తున్నారని గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్ మస్కు బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇచ్చిన ఎకరం భూమిలో జొన్న పంటను వేసుకుంటే.. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పాడైందని తెలిపారు. బ్యాంకులో రూ.80వేల రుణం తీసుకుంటే మాఫీ కాలేదని, రూ.2లక్షల వరకు మాఫీ చేస్తానని చెప్పారని.. తనకు కేవలం రూ.80వేలు రుణం ఉన్నా మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి.. నష్టపోయిన పంటకు పరిహారం, రైతు బంధు, దళిత బంధు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు.

యూపీ సీఎం యోగిని కలిసిన కార్పొరేటర్లు

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో నగర్ మేయర్, బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్, ఇతర కార్పొరేటర్లు

వనస్థలిపురం, సెప్టెంబర్ 23: ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో నగర మేయర్, కార్పొరేటర్లు లక్నోలో బేటీ అయ్యారు. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అందులో ఉన్నారు. యూపీలో చేపడుతున్న ప్రజా సంక్షేమం, పారిశుధ్య విధానాన్ని అధ్యయనం చేసేందుకు వారు లక్నోలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం సీఎం యోగి ఆథిత్యనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యోగితో సమావేశం కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు..

ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

కందుకూరు, సెప్టెంబర్ 23: విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యత పెంపొందించేందుకు కమిటీలు దోహదపడుతాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విష్ణుప్రియ తెలిపారు. సోమవారం మోడల్ స్కూల్, కళాశాలలో ఎన్నికల ప్రక్రియ తెలుసుకునేందుకు విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. 19మంది విద్యార్థులు ఎన్నికల్లో పోటీలో ఉండగా.. 571మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాఠశాల పీపుల్స్ లీడర్లుగా లక్షయ, దీవెన, అరవింద్‌రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్‌గా నవీన్, వైస్ కెప్టెన్‌గా దిలీప్, కల్చరల్ చైర్మన్‌గా ప్రణయ్, హరితహారం, స్వచ్ఛభారత్ కెప్టెన్‌గా భార్గవి, డిసిప్లేన్ కెప్టెన్‌గా కీర్తన, టీం లీడర్‌గా మాళవిక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమిదిని, సునీత, గురుజారెడ్డి, కొండల్ రావు, శ్రీనివాసచారి, పుష్పలత, కరుణాకర, విజయలక్ష్మి, సురేశ్, వేణుగోపాల్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించాలని వేధించిన వ్యక్తికి.. మూడేండ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్23(నమస్తే తెలంగాణ): మైనర్ బాలికను ప్రేమించాలని వేధించిన నిందితుడు మైనం కుమార్(27)కు మూడేండ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ.. బాలికకు పరిహారంగా లక్ష రూపాయలు చెల్లించాలని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పునిచ్చింది. ప్రత్యేక పీపీ బర్ల సునీత కథనం ప్రకారం.. నాగోలేకు చెందిన నిందితుడు మైనం కుమార్ డ్రైవర్. అదే ప్రాంతంలో ఉండే మైనర్ బాలికను నాలుగు సంవత్సరాలుగా తనను ప్రేమించాలని పెళ్లి చేసుకోవాలని వేధించడం ప్రారంభించాడు. బాలిక తన ప్రేమను నిరాకరించడంతో నిత్యం అసభ్యకరంగా మెసెజ్‌లు, ఫోన్ చేస్తూ వేధించడంతో బాలిక తల్లి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం కుమార్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

ఎంపీజే ఆర్థిక సహాయంతో నలుగురు ఖైదీల విడుదల

సైదాబాద్, సెప్టెంబర్ 23: మూవ్‌మెంట్ ఫర్ ఫీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ ఆర్థిక సహాయంతో చంచల్‌గూడ జైలు నుంచి నలుగురు ఖైదీలు విడుదలయ్యారని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి సలీముల్ హిందీ ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు ఖైదీలు జామీనుపై విడుదలయ్యేందుకు కోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ పేదరికంతో విడుదలకు అంటకం ఏర్పడిందన్నారు. వారి బంధువులు నిర్ణీత సమయంలో జరిమానా డబ్బులు చెల్లించలేకపోవటంతో జైల్లోనే ఉండాల్సి వచ్చింది. ఎంపీజే సంస్థ చొరవ తీసుకుని కోర్టు విధించిన మొత్తాన్ని చెల్లించి, వారి విడుదలకు సాయపడిందని తెలిపారు. తమ సంస్థ సహకారం కావాల్సిన వారు 040-24503818, 90103 20638లో సంప్రదించాలని కోరారు.